క్లుప్తంగా

వేణుగోపాల స్వామికి మల్లెలతో అలంకరణ



నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలిలోని వేణుగోపాల స్వామికి బుధవారం మల్లెలతో విశేష అలంకరణ చేశారు. ఏ.కొండూరు మండలం రామచంద్రాపురానికి చెందిన గుంటక ప్రసాద్‌రెడ్డి ఆలంకరణకు అవసరమైన 20 కేజీల మల్లెలను అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కే శశిరేఖ, పాలకవర్గ సభ్యులు ఎస్ నాగలక్ష్మీరావు ల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయం



ఇబ్రహీంపట్నం: విధి నిర్వాహణలో ఒత్తిడికి గురయ్యే ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ అశోక్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఏపీ జెన్‌కో వైద్యశాలలో ఎస్పీఎఫ్ పోలీస్‌లకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. క్రమం తప్పకుండా వ్యాయామంతోపాటు పోష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్య వంతులుగా ఉండొచ్చన్నారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ రాఘవేంద్రరావు గుండెకు సంబంధించిన బ్లడ్ కొలెస్ట్రాల్, బ్లడ్‌షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. గుండె వ్యాధులపై అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు. కమాండెంట్ కెఎన్.రావు, అసిస్టెంట్ కమాండెంట్ టికె.ఆచారి, ఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో ఇక్కట్లు



పుల్లూరు(మైలవరం): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటున్నారని సీపీఎం మండల కార్యదర్శి రావూరి రమేష్‌బాబు తెలిపారు. మైలవరం మండలం పుల్లూరు గ్రామంలో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రాంతంలో బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలనను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక రంగాన్ని దెబ్బతీస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సీహెచ్ సుధాకర్, వజ్రాల వెంకటరెడ్డి, వీ శ్రీనివాసరెడ్డి, ఎం. చరణ్, ఎల్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధికీ ప్రాధాన్యం

ఎమ్మెల్యే రక్షణనిధి



తిరువూరులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు అభివృద్ధి పనులకూ ప్రాధాన్యం ఇస్తున్నట్లు తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. తిరువూరు నగర పంచాయతీలోని 19వ వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వార్డులోని సంక్షేమ పథకాల లబ్ధిదారుల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే వారికి గత నాలుగేళ్లలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వివరాలను తెలియజేశారు. పేదరికం కారణంగా చదువు మానేయకుండా ఒకటో తరగతి నుంచి పీజీ వరకు చదివే విద్యార్థుల ఫీజులను ప్రభుత్వమే భరిస్తోందన్నారు. జగనన్న విద్యా కానుక, వసతి దీవెన, అమ్మ ఒడి, విద్యాదీవెన, విదేశీ విద్యాదీవెన తదితర పథకాలకు పెద్ద మొత్తంలో ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని ఎమ్మెల్యే వివరించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే వైఎస్సార్ పింఛను కానుక సొమ్మును వలంటీర్లు వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలకు, గీత కార్మికులకు ఇంటివద్ద చెల్లిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం ఇస్తూనే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. తిరువూరు పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృష్ణానదీ జలాలను రూ.160 కోట్లతో పైపులైన్ల ద్వారా సరఫరా చేసే పైలట్ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా సత్యనారాయణ, పరసా శ్రీనివాసరావు, షేక్ నదియా, ఏరువ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలన్నింటినీ నెరవేర్చిన సీఎం జగన్

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



కొత్త రావిచర్లలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అధికారంలోకి వచ్చిన తరువాత నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని కొత్తరావిచర్లలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ వార్డులోని ఇంటింటికీ వెళ్లి ఈ నాలుగేళ్లలో ఆయా కుటుంబాల వారికి ప్రభుత్వం నుంచి కలిగిన లబ్ధిని వివరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా ఎమ్మెల్యేలను ఇంటింటికీ తిప్పి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయలేదన్నారు. కేవలం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే ఆ పని చేస్తోందన్నారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. దీనిని బట్టే ప్రజల సమస్యలపై, వారి క్షేమం గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంత చిత్తశుద్ధి ఉందో ప్రజలు గమనించాలన్నారు. రైతు భరోసా, అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, రుణ మాఫీ, విద్యాదీవెన, వసతి దీవెన తదితర అనేక పథకాలను అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిఒక్కరూ అండగా ఉండాలన్నారు. ఈ నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల్లో ఏదో ఒక పథకం ప్రతి ఇంటికి చేరిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లావు నాగవరప్రసాద్, చెరుకూరి బ్రహ్మేశ్వరరావు, బొబ్బా సాంబశివరావు, శీలం ఏలియా, ఎంపీడీవో ఎంపీఎస్ సుందరి, ఏపీఎం దయాల రాజశేఖర్, ట్రాన్స్‌కో ఏఈ త్రిమూర్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న డాక్టర్ హరినాథరెడ్డి, డాక్టర్ శివప్రసాద్

పోరాటనగర్(మైలవరం): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే హరినాథరెడ్డి పేర్కొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ దత్తత గ్రామం మైలవరం మండలం పోరాటనగర్‌లోని ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు క్రికెట్, షటిల్, క్యారమ్ బోర్డు, చెస్ బోర్డు, రింగ్, స్కిప్పింగ్ రోప్స్, వాలీబాల్ తదితర స్పోర్ట్స్ కిట్లను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్‌కుమార్‌కు అందజేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బీ శివహరిప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలుగజేస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ బి. నాగరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ అధికారి ఎం.ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

30న ఏకలవ్య పాఠశాల ప్రవేశ పరీక్ష

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఎన్టీఆర్ జిల్లాలో ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు ఈ నెల 30న కొండపల్లి రాష్ట్ర గిరిజన గురుకుల సంక్షేమ బాలికల పాఠశాలలో ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరకాస్తు చేసుకున్న అర్హులైన విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ http:aptwf urukuam.ap.gov.in/ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. 7,8,9 తరగతుల్లో ఉన్న బ్యాగ్‌లాగ్ ఖాళీలకు గిరిజన బాలబాలికలు మాత్రమే అర్హులని తెలిపారు. వివరాలకు 83339 25169, 80743 25656లో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయులు ఐకమత్యంగా ఉండాలి



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

అగిరిపల్లి: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులందరూ ఐకమత్యంగా ఉండాలని ఎస్టీయూ రాష్ట్ర నాయకులు సీహెచ్ సురేష్‌కుమార్ అన్నారు. ఆగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 1998 డీఎస్సీ ఐదుగురు ఉపాధ్యాయులను, 2019, 2022 సంవత్సరాలకు సంబంధించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను సాధించిన కె.రాణిరత్నకుమారి, మక్కె వేణుగోపాలరావును సత్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయురాలు టి.పావన జ్యోతి సుజనకుమారి మాట్లాడుతూ 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు అంకెం వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు తాడి నరసింహారావు, షేక్ అబ్దుల్‌హక్ పాల్గొన్నారు.

శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళి



రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేవీవీ నాయకులు



పెనుగొలనులో రామానుజన్‌కు నివాళి

ఇబ్రహీంపట్నం: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ వర్ధంతి కార్యక్రమం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక జాకీర్ హుస్సేన్ కళాశాల్లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్. మహాబాష, గణిత అధ్యాపకురాలు ఎం.దుర్గాభవానీ, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి. కామేశ్వరరావు రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. జేవీవీ నాయకులు షేక్ సర్దార్ సాహెబ్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పెనుగొలనులో..

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలను ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాలలో బుధవారం షిరిడి సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో గణితమేధావి శ్రీనివాస రామానుజన్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్ఎం శ్రీనివాసరావు, ఏవీ నరసింహారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ సూరాయపాలెం ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా దిగువ పేర్కొన్న ప్రాంతాలలో గురువారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు కృష్ణ కరకట్ట, ఓల్డ్ పోస్టాఫీస్ రోడ్, వాటర్ ఫిల్టర్ బెడ్ ఏరియా వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

మైలవరం: నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ గణపతి దేవస్థానం వద్ద బుధవారం మజ్జిగ కేంద్రం ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే వారికి ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగించడానికి శ్రీలక్ష్మీ గణపతి దేవస్థాన కమిటీ సభ్యులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. దాతలు ఉదయగిరి కామేశ్వరరావు, కనకదుర్గ దంపతుల కుమారుడు సందీప్,ధనలక్ష్మి దంపతులు సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఉమ్మడదేవరపల్లి(గంపలగూడెం): గంపలగూడెం మండలం ఉమ్మడదేవరపల్లిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



బేబీ కిట్లను బాలింతలకు అందిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్

నూజివీడు: రోటరీక్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగోటౌన్ నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలోని బాలింతలకు 50 బేబీ కిట్లను, ఆస్పత్రి బెడ్‌లకు 100 దుప్పట్లను బుధవారం వితరణగా అందజేశారు. వీటిని ఎమ్మెల్యే మేకా ప్రతాప్, సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. దీనికి దాతల తోడ్పాటు కూడా తోడైతే పేద ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులలో అనేక మెరుగైన సదుపాయాలను కల్పించడం వీలవుతుందన్నారు. దాతృత్వం కలిగిన వారు ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి ఏదో ఒక సదుపాయాన్ని కల్పించాలన్నారు. సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేసుకుంటేనే పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్, రోటరీక్లబ్ అధ్యక్షుడు మలిశెట్టి శ్రీనివాస్, ప్రముఖ పారిశ్రామికవేత్త మూల్పూరి లక్ష్మణస్వామి, త్రివిధ శ్రీనివాస్, పైడి అనిల్, శారదా శంకర్, గొల్లపల్లి రవిబాబు, రత్నాకర్, డీ వెంకటరత్నం పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

నూజివీడు: నూజివీడు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన రోగులకు ఏరియా ఆస్పత్రిలోని వైద్యులు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఇందులో భాగంగానే రూ.21.25 కోట్లతో ఆస్పత్రిలో అధునాతన సదుపాయాలతో కూడిన నూతన భవనాన్ని నిర్మిస్తోందన్నారు. అంతేగాకుండా కోటి రూపాయలకు పైగా వ్యయంతో ఆక్సిజన్ ప్లాంట్‌ను సైతం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అంతేగాకుండా మూడు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను, ప్రతి మండలానికి ఒక 104 వాహనాన్ని, 108 వాహనాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. దీనికి తోడు ఆస్పత్రిలో నేడు దాదాపు 12 మంది వైద్యులు పనిచేస్తున్నారని, టీడీపీ ప్రభుత్వంలో పట్టుమని ఐదుగురు డాక్టర్లు కూడా ఉండేవారు కాదన్నారు. సమావేశానికి ముందు ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ తన నిధులతో ఏరియా ఆస్పత్రికి అందజేసిన మహాప్రస్థానం ఉచిత వాహనాన్ని సబ్‌కలెక్టర్ ఆదర్ష్‌రాజేంద్రన్‌తో కలిసి ప్రారంభించారు. అలాగే ఆక్సిజన్ ప్లాంట్‌ను, నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని పరిశీలించారు. సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయిస్తున్న ప్రతి రూపాయి సద్వినియోగం కావాలన్నారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్, కమిటీ సభ్యులు స్నేహా రైడ్స్ సంస్థ చైర్మన్ బసవరాజు నగేష్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, వైద్యురాలు శారద పాల్గొన్నారు.

మొక్కలు పెంచడంతో ప్రకృతి వైపరీత్యాల నివారణ



మొక్కలు నాటుతున్న జిల్లా యువజన సర్వీసుల అధికారి శ్రీనివాసరావు

ఇబ్రహీంపట్నం: మొక్కలు విరివిగా పెంచడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలు నివారించవచ్చని జిల్లా యువజన సర్వీసుల శాఖ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి యు.శ్రీనివాసరావు అన్నారు. జాకీర్ హుస్సేన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా బుధవారం వివిధ రకాల మొక్కలు ఆయన నాటారు. భూమి ఆరోగ్యంగా ఉంటేనే మానవ మనుగడ సాధ్యమన్నారు. పర్యావరణ అసమతుల్యతతో వరదలు, భూకంపాలు, సునామీ వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయని తెలిపారు. మొక్కల నాటాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.మహాభాష, నాగుల్ మీరా, మస్తాన్‌వలి, జాఫర్‌సాధిక్, అడ్వకేట్ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

కిడ్నీ రోగుల ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

తిరువూరు: కిడ్నీ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్న తిరువూరు ప్రాంతంలో కిడ్నీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కే సాయిప్రసాద్ కోరారు. తిరువూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో, డయాలసిస్ కేంద్రంలో కిడ్నీ రోగులకు అందుతున్న వైద్యసేవలను బుధవారం ఆయన పరిశీలించారు. వ్యాధి తీవ్రత పెరగక ముందే కిడ్నీ పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంటే రోగులు మృత్యువాత పడే పరిస్థితి ఉండదని, ప్రభుత్వమే కిడ్నీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరారు.

హెచ్‌ఎంలకు శిక్షణ తరగతులు

విస్సన్నపేట: ప్రధానోపాధ్యాయులు సోషల్ ఆడిట్‌కు సంబంధించి నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో అంశాలను క్షుణంగా తెలుసుకోవాలని ఎంఈఓ చదల రామకృష్ణ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోషల్ ఆడిట్‌కు సంబంధించి శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

బాలసదనంలో ఆటల పోటీలు



ఆటల పోటీలు నిర్వహిస్తున్న సిబ్బంది

నూజివీడు: పట్టణంలోని బాలసదనంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా బుధవారం పిల్లలకు కబడ్డీ, ఖోఖో, లూడో, టగ్ ఆఫ్ వార్, క్యారమ్స్, చెస్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ జీ రాగమయి, వీ భానులత, పీ చంటిమ్మ, పీఈటీ కే ప్రకాశ్‌బాబు పాల్గొన్నారు.

సమగ్ర పంటల యాజమాన్యంతో అధిక దిగుబడులు

మునుకుళ్ల(తిరువూరురూరల్): సమగ్ర పంటల యాజమాన్యంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి ఎస్. నాగమణెమ్మ రైతులకు సూచించారు. మండలంలోని మునుకుళ్లలో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు క్రమం తప్పకుండా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాల సాధనకు వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని సూచించారు. జిల్లా ఉప సంచాలకులు మాధవీలత, ఎన్టీఆర్ జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వెంకటరెడ్డి, ఏడీఏలు కెనడీ, మోనీషా, తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ వెదురు గోపిరెడ్డి, వ్యవసాయాధికారులు పద్మ, టిప్పు సుల్తాన్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు బొంతా సాంబశివరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ప్రభుత్వం ద్వారా జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై సమీక్ష జరిపారు. మండల స్థాయిలో రైతు విభాగం, ఐటీ వింగ్, బీసీ సెల్ విభాగాల్లో ఖాళీగా ఉన్న పదవుల భర్తీకి ప్రజాప్రతినిధులు, నాయకుల అభిప్రాయాలు స్వీకరించారు. ఒక్కో విభాగంలో ముగ్గురు చొప్పున ఎంపిక చేశారు. లిస్టును ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సాంబశివరావు తెలిపారు.

ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ రంగనాథ్ మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి పంటకు మద్దతు ధర కల్పించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. దళారులు, మిల్లర్ల ప్రమేయం లేకుండా రబీ ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల దగ్గరకు తీసుకురావాలని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలకు వచ్చే రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. కార్యక్రమంలో విజయవాడ రూరల్ వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బయ్యారపు రవికిషోర్, ఎంపీటీసీ సభ్యురాలు కల్పన పాల్గొన్నారు.

యాప్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలి

గంపలగూడెం: సుస్థిరాభివృద్ధి యాప్‌లో సిబ్బంది తప్పులు లేకుండా ఇచ్చిన అంశాలను సక్రమంగా నమోదు చేయాలని డిప్యూటీ గణాంక అధికారి బి.రమేష్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల యాప్లో 0 నుంచి ఐదు సంవత్సరాల వయస్సు గల పిల్లల నమోదు, ఆరేళ్ల నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లల నమోదు బాలింతలు గర్భిణుల నమోదు చేసి విధానాన్ని వివరించారు. ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సహాయగణాంక అధికారి అక్బర్‌పాషా, మండల పరిషత్ అడ్మినిస్ట్రేటీవ్ అధికారి ఎం.సబిత పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ జపం చేస్తున్న కేంద్రప్రభుత్వం

సీపీఐ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు



సభలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

తిరువూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ జపం చేస్తూ నిరుద్యోగాన్ని పెంచుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు విమర్శించారు. తిరువూరు బోస్‌సెంటర్లో సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ విధానాలను నిరసిస్తూ బుధవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయడానికి అత్యుత్సాహం చూపుతోందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక విధానం, ఇతర రాష్ట్రాల్లో మరో విధానం అనుసరించడం శోచనీయమన్నారు. లాభనష్టాలతో పనిలేకుండా వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ఏకపక్షంగా ప్రైవేటుపరం చేయడం సబబుకాదన్నారు. సీపీఎం జిల్లా నాయకులు డీవీ కృష్ణ, సీహెచ్ బాబూరావు, వామపక్షాల నాయకులు కృష్ణయ్య, నాగుల్‌మీరా, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.